క్లుప్తంగా

వైభవంగా ప్రభబండ్ల వేడుకలు



డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో శుక్రవారం హోలీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రభబండ్ల మహోత్సవం వైభవంగా జరిగింది. గ్రామంలోని తిరుపతమ్మతల్లి, గోపయ్య ఆలయంలో తిరుపతమ్మతల్లి కల్యాణ వేడుకలను పురస్కరించుకుని గ్రామంలో ఎడ్ల బండ్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలకు ప్రభలను అమర్చుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. రాత్రి ఆలయంలో తిరుపతమ్మతల్లి, గోపయ్య కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

శివాలయంలో 16వ పండుగ



గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణం అనంతరం జరిగే 16 పండుగ వేడుకలను ఘనంగా జరిపించారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి పండుగ రోజు శివపార్వతుల కల్యాణం జరిపించడం ఆనవాయితీ. ఈ క్రమంలో జరిగే 16వ పండుగను ప్రతీ సంవత్సరం హోలీ పండుగ రోజు నిర్వహిస్తారు. ఆలయ పూజారి సతీష్‌పాండ్యే ఉదయాన్ని సుప్రభాత సేవతో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.

సుదర్శన యజ్ఞం

మహబూబాబాద్ రూరల్: పౌర్ణమి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో శుక్రవారం సుదర్శన యజ్ఞం పూజా కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు భాగవతుల వంశీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో శ్రీసుదర్శన భగవానుడి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి యజ్ఞం ప్రారంభించి భక్తుల గోత్రనామాలపై అర్చన జరిపి పూజలు చేశారు. సాయంత్రం బండ్లు తిరగడం, అశ్వ వాహన సేవ ఏర్పాటు చేసి మంగళ వాయిద్యాలతో స్వామివారు, అమువార్లను రథంపై ఊరేగింపు నిర్వహించారు.

మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం



మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి రెవెన్యూ పరిధిలోని భూక్యతండా గ్రామ పంచాయతీలో మల్లికార్జున స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, క్లాస్‌-1 కాంట్రాక్టర్ రామడుగు అచ్చుతరావు దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు మంగళవాయిద్యాల మధ్య జరిపించారు.

మాంగళ్య గౌరీ దేవికి అభిషేకాలు

మహబూబాబాద్ రూరల్: పాల్గుణ మాస పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో మాంగల్యగౌరీదేవి అమ్మవారికి శుక్రవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రంగావఝుల సుధాకర శాస్త్రి, సునీత దంపతుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఆర్య సమాజ మందిరంలో దేవ యజ్ఞం

మహబూబాబాద్ రూరల్: హోలీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పతంజలి ప్రాణ యోగ ఆరోగ్య సేవ కేంద్రంలో లోక కల్యాణార్థం వేద మంత్రాలతో శుక్రవారం యజ్ఞం, దేవ యజ్ఞం నిర్వహించారు. ఆర్య సమాజ మందిరం ఆధ్వర్యంలో ఆర్య సమాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు నారాయణప్రకాష్ లోయ భక్తుల సమక్షంలో యజ్ఞం, దేవ యజ్ఞం జరిపి ఆశీర్వచనాలు అందజేశారు.

వీరభద్రుడిని దర్శించుకున్న చైర్మన్

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామిని తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ శుక్రవారం దర్శించుకున్నాడు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన పేరుపై గోత్ర నామార్చనలు చేశారు. తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్, గుండ్లపల్లి శ్రీనివాస్, జగన్, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

సందడిగా హోలీ సంబురాలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం యువతీ యువకులు, చిన్నారులు హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రంగులు చల్లుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పలుచోట్ల హోలీ పురస్కరించుకుని కాముడి దహనం చేశారు. - సాక్షి నెట్‌వర్క్

మహబూబాబాద్: వైద్యుల ఆధ్వర్యంలో హోలీ సంబరాలు



మహబూబాబాద్ అర్బన్: హోలీ వేడుకల్లో నాయకులు



మహబూబాబాద్ రూరల్: హోలీ వేడుకల్లో మిత్రులు



మహబూబాబాద్ రూరల్: హోలీ వేడుకల్లో చిన్నారులు





నెహ్రూసెంటర్‌లో హోలీ వేడుకలు..



మరిపెడ: హోలీ వేడుకల్లో యువకులు



గార్ల: వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



కేసముద్రం: హోలీ వేడుకల్లో మహిళలు



నెల్లికుదురు మండల కేంద్రంలో..



దంతాలపల్లి: హోలీ ఆడుతున్న యువకులు



మరిపెడ రూరల్: అబ్బాయిపాలెంలో..



తొర్రూరులో..



నర్సింహులపేటలో..



కురవి: హోలీ సంబురాల్లో పాల్గొన్న మహిళలు



చిన్నగూడూరు: హోలీ ఆడుతున్న చిన్నారులు



బయ్యారం: తాతకు రంగులు పూస్తున్న చిన్నారులు



కురవి: సీరోలు కందికొండలో..



పెద్దవంగర: బొమ్మకల్లులో..



గూడూరు: హోలీ వేడుకల్లో మహిళలు



డోర్నకల్: హోలీ వేడుకల్లో మార్వాడీలు

ఉద్యోగాల భర్తీ నిలిపి వేయాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ పీరయ్య

మహబూబాబాద్: ఎస్సీల వర్గీకరణకు అసెంబ్లీలో చట్టం అమలు అయ్యేంత వరకు గ్రూపు-1, గ్రూపు-2, గ్రూపు-3 ఉద్యోగాల భర్తీ నిలిపి వేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశాడు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పీరయ్య మాట్లాడుతూ.. ఆగస్టు ఒకటో తేదీన సుప్రీం కోర్టు ధర్మాసనం తీర్పును స్వాగతించాలన్నారు. చట్టంను అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, భిక్షపతి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న పీరయ్య

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

మహబూబాబాద్ రూరల్: అనంతాద్రి శ్రీజగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవ పూజల్లో భాగంగా ప్రధాన అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు పర్యవేక్షణలో గొడవర్తి శ్రీనివాసచార్యులు యాజ్ఞిక నిర్వహణలో నాల్గో రోజు శుక్రవారం అష్టోత్తర శత కలశాల (108)తో స్వామివారికి వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. శ్రీహనుమద్ వాహన సేవ ఏర్పాటు చేసి స్వామివారు, అమ్మవార్లను హనుమంతుడి వాహనంపై కొలువు దీర్చి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో నాయిని ప్రభాకర్ రెడ్డి, మాలె కాశీనాథ్, పుల్లఖండం వేణుగోపాల్, మల్యాల రంగారావు పాల్గొన్నారు. అనంతాద్రి శ్రీజగన్నాథ వెంకటేశ్వర స్వామివారి దేవాలయ వార్షికోత్సవ పూజా వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం 9 గంటలకు శ్రీలక్ష్మీనృసింహ యజ్ఞం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు.

రాములోరికి కోటి గోటి తలంబ్రాలు



జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

బయ్యారం: సీతారాముల కల్యాణం నిమిత్తం బయ్యారంలోని రామాలయంలో చేతితో ఒలిచిన కోటి గోటి తలంబ్రాలను శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాచలానికి తీసుకెళ్లారు. పదిహేను రోజులుగా ఆలయంలో మహిళలు వడ్లను చేతితో ఒలిచి బియ్యంగా తయారు చేశారు. భద్రాచలానికి తీసుకెళ్తున్న గోటి తలంబ్రాల బస్సును ఆలయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు సుదర్శనచార్యులు, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, యాకూబ్‌రెడ్డి, సత్యం, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎస్ఓ ద్విచక్రవాహనంలో పాము!

కొత్తగూడ: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ద్విచక్రవాహనంలో డ్యాష్ బోర్డ్‌లో పాము చేరిన సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి కొత్తగూడ సెక్షన్ అధికారి తన ద్విచక్రవాహనం తీసుకుని గువ్వల బోడు సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. ఒక చెట్టు కింద వాహనాన్ని నిలిపి అడవిలో తిరిగి వచ్చి వాహనం తీద్దాం అనుకునే సరికి డ్యాష్ బోర్డు స్పీడో మీటర్ పైన పాము పడుకుని బుసలు కొట్టడం తో అప్రమత్తం అయి కర్రతో తీసి వేశాడు. దీంతో ప్రమాదం తప్పింది.



కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

తొర్రూరు రూరల్: నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని అరిపిరాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్ తండ్రి రాములు అనారోగ్యంతో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఝాన్సీరెడ్డి స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం నిరంతరం పని చేస్తూ అనేక కారణాలతో మృతి చెందుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన అండగా ఉంటామన్నారు.

వృద్ధురాలి అంతిమయాత్రలో సీఐ

నెల్లికుదురు: మృతి చెందిన వృద్ధురాలి అంతిమయాత్రలో మహబూబాబాద్ సీఐ పెండ్యాల దేవేందర్ పాల్గొని మానవత్వం చాటుకున్నారు. ఈసంఘటన మండలంలోని ఆలేరులో గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆలేరు గ్రామానికి చెందిన వృద్ధురాలు చీకటి ఉపేంద్ర (65) అనాథ ఎవ్వరు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తినడానికి తిండి లేక, ఉండటానికి ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఈవిషయాన్ని సుమారు 7ఏళ్ల క్రితం నెల్లికుదురు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పెండ్యాల దేవేందర్ తెలుకున్నారు. ఉండటానికి ఇళ్లు నిర్మించి, తన సొంత ఖర్చులతో ఇప్పటి వరకు నిత్యావసర సరకులు అందిస్తూ అన్నీ తానై సొంత కొడుకులా చూసుకున్నాడు. ఉపేంద్ర మృతి చెందిన విషయం తెలుసుకుని హోలీ పండుగని చూడకుండా ఇప్పుడు మహబూబాబాద్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న దేవేందర్ ఆలేరుకు చేరుకుని వృద్ధురాలి అంత్యక్రియల్లో పాల్గొని పాడే మోసి తన మానవత్వం చాటుకున్నాడు.



పాడె మోస్తున్న సీఐ దేవేందర్

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ఉత్తరతండా జీపీ పరిధిలో గల రాయకుంట తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. రూరల్ ఏఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. రాయకుంట తండాకు చెందిన బానోతు సురేష్ (26) ఫిబ్రవరి 2న తన భార్య మౌనిక, కుమారుడు హర్షవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి వస్తున్నారు. కేంద్రం శివారులోని బీజేపీ కార్యాలయ సమీపంలో సురేష్ వాహనాన్ని ఈదులపూసపల్లి వైపునకు వెళ్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. గాయపడిన సురేష్‌ను ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం సురేష్ అకస్మాత్తుగా మృతిచెందాడు. తండ్రి బిచ్య రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య మృతి తట్టుకోలేక భర్త..

నర్సింహులపేట: మండలంలోని అజ్మీరతండా జీపీ పరిధిలోని వాంక్‌డోత్ తండాకు చెందిన వాంక్‌డోత్ భీమా(46) తన భార్య మృతిని తట్టుకోలేక మనస్తాపంతో పురుగుల మందుతాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. మృతుడి భార్య బుజ్జి ఫిబ్రవరి 23న కుటుంబ కలహాలతో కిరోసిన్ పోసుకొని నిప్పు అట్టించుకొని చికిత్స పొందుతూ ఫిబ్రవరి 27న మృతి చెందింది. భార్య మృతి చెందడంతో మనస్తాపంతో భర్త భీమా ఈనెల 3న పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. 15 రోజుల వ్యవధిలోనే భార్యభర్తలు మృతి చెందడంతో కుటుంబం వీధిన పడింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు.

విద్యుత్ మోటారు చోరీ

చిన్నగూడూరు: వ్యవసాయ పొలం బావి వద్ద విద్యుత్ మోటార్ చోరీ జరిగిన సంఘటన మండలంలోని ఉగ్గంపల్లి శివారు మాలోతు తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుడు మాలోతు రాజ్యు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున పొలానికి నీళ్లు పెడదామని రాజ్యు బావి వద్దకు చేరుకోగానే విద్యుత్ తీగలు చిందరవందరగా పడి ఉన్నట్లు తెలిపాడు. దీంతో విద్యుత్ మోటార్ చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. విద్యుత్ మోటార్ విలువ సుమారు రూ. 20వేలు ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గార్ల: బైక్‌పై వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన కొత్తగూడెంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల లోని హనుమంతుడి బజారుకు చెందిన బండి ఉపేందర్, బోళ్ల వీరన్నలు గత 3నెలల క్రితం సుతారి పనుల కోసం కొత్తగూడెం వెళ్లి అక్కడే ఉంటున్నారు. ఉదయం వీరిద్దరు కలిసి సుతారి పనులకు బైక్‌పై వెళ్తుండగా లక్ష్మీదేవిపల్లి గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడిపోవడంతో ఇద్దరికి కాళ్లు విరిగిపోయి తీవ్ర రక్తస్రావం అయ్యింది. గమనించిన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స జరిపిస్తున్నారు.

మల్లయ్య మృతి తీరని లోటు

తొర్రూరు: స్వాతంత్ర్య సమరయోధుడు దాసరి మల్లయ్య మృతి నియోజకవర్గానికి తీరని లోటు అని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఈమేరకు పట్టణంలో దాసరి మల్లయ్య కుటుంబ సభ్యులను శుక్రవారం ఝాన్సీరెడ్డి పరామర్శించారు.

పేదలకు బిర్యానీ, మంచినీళ్ల అందజేత

మహబూబాబాద్ రూరల్: రంజాన్ పండుగ ఉపవాస దినోత్సవాలను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ పరిసరాల ప్రాంతాల్లో పేదలు, నిరాశ్రయులకు ముస్లిం చిన్నారులు, విద్యార్థులు శుక్రవారం రాత్రి సుమారు 60మందికి పండ్లు, బిర్యాని పొట్లాలు, మంచి నీళ్ల బాటిళ్లను అందజేశారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

గార్ల: కార్మికుల శ్రమదోపిడీ విముక్తి మార్గదర్శకుడు కారల్ మార్క్స్ వర్ధంతి వేడుకలను శుక్రవారం గార్లలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, రామకృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేడుకలు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ వేడుకలు గురువారం అర్ధరాత్రి ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో వందలాది భక్తుల సమక్షంలో కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం అంకాలమ్మ తల్లికి బోనాలను పెద్ద ఎత్తున మహిళలు హాజరై మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేదపండితులు బ్రహ్మశ్రీమహేష్ శర్మ, కైతోజ్ అన్వేష్, రాగి యాకేంద్రచారి, పబ్బోజ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు